క్లుప్తంగా

పర్యాటకానికి అపారమైన అవకాశాలు



మాట్లాడుతున్న బాలాజీ

బీచ్‌రోడ్డు: విశాఖను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ అన్నారు. బీచ్ రోడ్డులోని ఓ హోటల్లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖలో 8 మంది పెట్టుబడి దారులతో ప్రభుత్వం ద్వారా 36 ఎకరాలు, పెట్టుబడిదారుల ద్వారా 30 ఎకరాలు సేకరించి మొత్తం 76 ఎకరాల్లో పర్యాటక ప్రాంతం అభివృద్ధి చేసేందుకు ఒప్పందాలు చేసుకున్నట్టు చెప్పారు. రూ.1217 కోట్లతో పర్యాటక ప్రాంతాలను రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

చోరీకి పాల్పడిన పాత నేరస్తుడి అరెస్ట్

ఎంవీపీకాలనీ: పెదవాల్తేరు శివాలయం హుండీ ఆదాయాన్ని చోరీ చేసిన పాత నేరస్తుడిని ఎంవీపీ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు... గత ఆదివారం సాయంత్రం పాత నేరస్తుడైన తూముల హరికృష్ణ హుండీలో నగదు దొంగిలించాడు. సోమవారం దొంగతనం జరిగినట్లు గుర్తించిన ఆలయ పూజారి ఎంవీపీ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు సీసీ కెమెరా ద్వారా నిందితుడి చేతిపై టాటూను గుర్తించారు. దీంతో హరికృష్ణ దొంగతనానికి పాల్పడినట్లు అనుమానించి అదుపులోకి తీసుకొని విచారించగా తానే దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో అతన్ని అరెస్ట్ చేశారు.

ఆన్‌లైన్ గేమ్స్‌లో జాగ్రత్తలు పాటించాలి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ వీఎస్ కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఐ.విజయబాబు సూచించారు. రెస్పాన్సిబుల్ గేమింగ్‌పై కళాశాలలో కంప్యూటర్ సైన్స్, కామర్స్ విభాగాల ఆధ్వర్యంలో సోషల్ మీడియా అండ్ మేటర్స్ సహకారంతో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు సూచనలు చేశారు. రిసోర్స్ పర్సన్ అర్నిక మాట్లాడుతూ ఆన్‌లైన్ గేమ్స్ బాధ్యతగా ఆడాలన్నారు. కార్యక్రమంలో ఎ.శివప్రసాద్, జి.రాజ్ కుమార్, ఎస్.సాంబమూర్తి, పి.రామచంద్ర, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు తోడ్పాటు అందిస్తాం



క్రీడాకారులతో ఆచార్య విజయమోహన్

విశాఖ విద్య: ప్రతిభ గల క్రీడాకారులకు తోడ్పాటు అందిస్తామని ఆంధ్ర యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ ఆచార్య విజయ మోహన్ అన్నారు. బ్లూస్టార్ ఫుట్‌బాల్ క్లబ్‌లో శిక్షణ పొందిన ఫుట్‌బాల్ ప్లేయర్లు జాతీయ, విశ్వ విద్యాలయ స్థాయిలో ఎంపికై రాణించిన సందర్భంగా వారిని మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు.

విదేశాల్లో ఉన్నత విద్యకు యువత మొగ్గు

బీచ్‌రోడ్డు: నగరాల్లో విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యపై మొగ్గు చూపుతున్నారని టాటా క్యాపిటల్ లిమిటెడ్ రిటైల్ ఫైనాన్స్ సీవోవో వివేక్ చోప్రా తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్, ఏవియేషన్, మెడిసిన్, టెక్నాలజీ తదితర రంగాల్లో ఎమర్జింగ్ కోర్సులను ఎంచుకునే విద్యార్థుల అవసరాలను తీర్చడం కోసం భవిష్యత్తు మార్కెట్లపై టాటా క్యాపిటల్ దృష్టి సారించిందని తెలిపారు. ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులకు రూ.85 లక్షల వరకు పూచీకత్తు లేకుండానే విద్యారుణాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం చదువు కయ్యే ఖర్చును కవర్ చేయడానికి రూ.2 కోట్ల వరకు సెక్యూర్డ్ రుణాలు కలవన్నారు.

నాడు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యరంగానికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చింది. కోట్ల రూపాయలతో ఆస్పత్రుల్లో వసతులు కల్పించింది. నాణ్యమైన వైద్యంతో పాటు వసతులు కూడా అద్భుతంగా ఉండేవి. ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు అవసరమైన నిధులు అందించడంతో ఆస్పత్రులు పరిశుభ్రంగా ఉండేవి.

నేడు

ప్రభుత్వాస్పత్రులను కూటమి సర్కారు గాలికి వదిలేసింది. మందుల దగ్గర నుంచి కనీస వసతులను కూడా పట్టించుకోవడం లేదు. నిర్వహణకు అవసరమైన నిధులకు చుక్కలు చూపెడుతోంది. ఫలితంగా సర్కారు ఆస్పత్రుల్లో అవస్థలు మొదలయ్యాయి. మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా మారడంతో రోగులు చుక్కలు చూస్తున్నారు.



విమ్స్ మూడో అంతస్తు ప్లాస్టిక్ సర్జరీ వార్డు విభాగంలో తాడుతో కట్టిన పురుషుల మరుగుదొడ్ల తలుపులు

నిర్వహణ లోపం.. రోగులకు శాపం

- ఆస్పత్రుల నిర్వహణ గాలికి..
- అధ్వానంగా మరుగుదొడ్లు
- అత్యవసరమైతే రోగుల పాట్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



మరుగుదొడ్లు పని చేయక బయట తాగునీటి ట్యాప్ వద్ద బ్రష్ చేస్తున్న మహిళా రోగి



ఛాతీ ఆస్పత్రిలో పూర్తిగా పాడైన మల విసర్జన బేసిన్

బీచ్‌రోడ్డు/ఆరిలోవ: కూటమి పాలనలో నిర్వహణ లోపంతో ప్రభుత్వ ఆస్పత్రులు కళ తప్పుతున్నాయి. మౌలిక వసతులు కరువవుతున్నాయి. కనీసం మరుగుదొడ్ల నిర్వహణను కూడా పట్టించుకోకపోవడం లేదు. దీంతో కొన్ని చోట్ల తాళాలు వేశారు. ఉన్నవి కూడా ఆధ్వానంగా మారడంతో రోగులతో పాటు బంధువులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

ఛాతీ ఆస్పత్రిలో..

ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రిలో రోగుల సహాయకుల కోసం నిర్మించిన మరుగుదొడ్లు పూర్తిగా శిథిలమైపోయాయి. ఆ ప్రాంతమంతా దుర్గంధంతో ఉండడంతో అటుపక్కకు వెళ్లాలన్నా హడలిపోయే పరిస్థితి ఉంది. అనారోగ్యంతో వచ్చిన రోగి పరిస్థితి ఎలా ఉన్నా, సహాయకులకు మాత్రం రోగాలు వచ్చేలా ఉన్నాయి.

ఈఎన్‌టీ ఆస్పత్రిలో..

ఈఎన్‌టీ ఆస్పత్రిలో నిర్వహణ సరిగ్గా లేక కొన్ని మరుగుదొడ్లను పూర్తిగా మూసివేశారు. దీంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. మరోవైపు ఓపీ చూపించుకునేందుకు వస్తున్న రోగులకు ఏర్పాటుచేసిన మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉండడంతో వాటిని వినియోగించేందుకు రోగులు ఆసక్తి చూపించడం లేదు. కనీసం చేతులు శుభ్రం చేసుకునేందుకు సైతం సదుపాయం లేక మంచినీటితోనే చేతులను శుభ్రం చేసుకుంటున్నారు. మూత్ర విసర్జన చేసుకునే బేసిన్లు పూర్తిస్థాయిలో పాడైపోయాయి.

విమ్స్‌లో తాళాలు

విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉంది. కొన్ని నెలలుగా రోగులు, వారి సహాయకులు కూడా నిత్యం నరకం చూస్తున్నారు.

ఇక్కడ అన్ని వార్డుల్లోని మరుగుదొడ్లలో అమర్చిన ట్యాప్‌లు చాలావరకు పాడయ్యాయి. మరికొన్ని ట్యాప్‌లను విప్పేసి ఎవరో ఎత్తుకుపోయారు. ఇవన్నీ పురుషుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లలోనే కావడం విశేషం. ట్యాప్‌లు తొలగించడంతో నీరు సరఫరా కాకపోవడంతో వాటిని వినియోగించకుండా మూసేశారు. ఎవరూ లోపలికి ప్రవేశించేవీల్లేకుండా తలుపులను తాళ్లతో కట్టేశారు. విమ్స్ అత్యవసర విభాగంలో మరుగుదొడ్ల తలుపుల గడియను తాళ్లతో కట్టేసి, అడ్డంగా విరిగిన కుర్చీ పెట్టేశారు. మొదటి అంతస్తు జనరల్ వార్డులో పురుషుల మరుగుదొడ్ల తలుపుల గడియను తాళ్లతో కట్టేశారు. రెండో అంతస్తులో ఐసీయూ వార్డులు, మూడో అంతస్తులో ప్లాస్టిక్ సర్జరీ వార్డులో కూడా మరుగుదొడ్ల తలుపులు తాళ్లతో కట్టేసి మూసేశారు. దీంతో అత్యవసరమైన వారు అవస్థలు పడుతున్నారు.

కిటకిటలాడుతున్న ఆస్పత్రి

ప్రతి రోజు విమ్స్‌లో 600కు పైగా ఓపీ నమోదవుతోంది. దీంతో రోజూ రోగులు, వారి బంధువులతో ఓపీ విభాగం కిటకిటలాడుతోంది. వారితో పాటు ఇన్‌పేషెంట్ వార్డుల్లో వందల మంది ఉంటున్నారు. వారంతా మరుగుదొడ్ల సమస్య ఎదుర్కొంటున్నారు. ఆస్పత్రులలో ఇలాంటివాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు రోగుల నుంచి వినిపిస్తున్నాయి. ఇక్కడ మరుగుదొడ్లను శుభ్రం చేయడానికి వినియోగించే బ్లీచింగ్, యాసిడ్ లాంటివి కూడా ఉండటం లేదని సమాచారం.

మహిళల మరుగుదొడ్ల వినియోగం

విమ్స్‌లోని అన్నివార్డుల్లోని పురుషుల మరుగుదొడ్లు మూసే ఉండటంతో అత్యవసర సమయాల్లో పురుషులు కూడా మహిళల మరుగుదొడ్లనే వినియోగించాల్సి వస్తోంది. దీంతో మహిళా రోగులు, వారి సహాయకులు ఇబ్బంది పడుతున్నారు. మంగళవారం ఓ వార్డులో పురుషులు మహిళల మరుగుదొడ్లను వినియోగించడంతో, ఓ మహిళా రోగి బయట అటెండెంట్ల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాప్ వద్ద బ్రష్ చేయాల్సి వచ్చింది. అక్కడ బ్రష్ చేయడం గమనించిన మిగిలిన రోగుల అటెండెంట్లు ఆ ట్యాప్‌ను వినియోగించడం మానేశారు.

సిబ్బందికీ అదే సమస్య

ఇక్కడ నర్సింగ్, సెక్యూరిటీ సిబ్బందికీ ఇదే సమస్య ఎదురవుతోంది. షిఫ్టుల వారీగా సుమారు 8 గంటల పాటు విధులలో ఉంటున్న ఇక్కడ సిబ్బంది మల మూత్ర విసర్జనకు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో ఉన్నామంటూ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని నెలల నుంచి ఇదే సమస్య ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు.



ఈఎన్‌టీ ఆస్పత్రిలో చేతులు శుభ్రం చేసుకునే ట్యాప్‌లు ఏవీ?

ఏయూ ఏఈఆర్‌సీపై సమీక్ష




సమీక్షలో పాల్గొన్న వర్సిటీ అధికారులు

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీలోని వ్యవసాయ ఆర్థిక పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏఈఆర్‌సీ కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ లిల్లిగ్రేస్ ఆధ్వర్యంలో, ఏయూ వీసీ ఆచార్య జి. శశిభూషణరావు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. 56 ఏళ్ల చరిత్ర గల ఈ పరిశోధన కేంద్రంలో జరిగిన, జరుగుతున్న పరిశోధనలపై, పరిపాలనకు సంబంధించిన విషయాల గురించి గౌరవ భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధులు సమీక్షించారు. సమీక్ష సమావేశంలో ప్రిన్సిపల్ ఎకనామిక్ అడ్వైజర్ దేవజిత్ ఖౌండ్, అడ్వైజర్ ప్రమోదిత సతీష్, ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు, ఫైనాన్స్ అధికారి, కేంద్రం సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా సూచీ బోర్డు





పెదగదిలి కూడలి వద్ద బోల్టులు ఊడిపోయి ప్రమాదకరంగా సూచీ బోర్డు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో ట్రాఫిక్ సూచీ బోర్డులు ప్రమాదకరంగా మారాయి. హనుమంతవాక నుంచి అడవివరం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డులో కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసులు కొన్నాళ్ల కిందట సూచీ బోర్డులు ఏర్పాటు చేశారు. ఆ బోర్డులు పలు చోట్ల ప్రమాదకరంగా మారాయి. పెదగదిలి, దీన్‌దయాల్‌పురం, పైనాపిల్‌కాలనీ కూడళ్ల వద్ద సూచీ బోర్డుల బోల్టులు ఊడిపోయాయి. దీంతో ఇవి ఎప్పుడు కిందపడిపోతాయో తెలియని పరిస్థితికి చేరాయి. పెదగదిలి కూడలి వద్ద స్తంభానికి ఒకవైపు బిగించిన ఎనిమిది బోల్టుల్లో ఏడు బోల్టులు ఊడిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ఆ బోర్డు ఎప్పుడు కిందపడుతోందో, ఆ సమయంలో ఎవరికి ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు భయపడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

కేంద్ర మంత్రుల పర్యటనను విజయవంతం చేయండి

ఎంవీపీకాలనీ: ఈ నెల 30న విశాఖలో కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పర్యటనను బీజేపీ శ్రేణులు విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు కోరారు. ఈ మేరకు మంగళవారం లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ఆర్థిక స్వావలంబన కోసం ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్లు కేటాయించిందన్నారు. ఈ నేపథ్యంలో విశాఖ వస్తున్న కేంద్ర ఉక్కుశాఖ మంత్రులకు ఘన స్వాగతం పలకడంతో పాటు వారి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర, రాష్ట్ర కోశాధికారి నాగేంద్ర పాల్గొన్నారు.

పద్మ అవార్డు గ్రహీతలకు అభినందన

మద్దిలపాలెం: రిపబ్లిక్ డే సందర్భంగా భారత ప్రభుత్వం సినిమా పరిశ్రమ అభివృద్ధికి.. ఎదుగుదలకు కృషి చేసిన ప్రముఖులకు పద్మ అవార్డులు ప్రకటించడంపై వైజాగ్ ఫిల్మ్ సొసైటీ హర్షం వ్యక్తం చేసింది. అవార్డులకు ఎంపికైన వారికి అభినందన లేఖలు పంపించినట్టు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధి ప్రకాశ్ ,కాశీ విశ్వేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్లపై మూగజీవాలతో అవస్థలు



రోడ్లపై కట్టిన పశువులు.. అధ్వానంగా మారిన పరిసరాలు

- లాసెన్స్ బేలో మరీ దారుణం
- కంపుకొడుతున్న పరిసరాలు

ఎంవీపీకాలనీ: నగరంలోని స్మార్ట్ కాలనీల్లో ఒకటైన ఎంవీపీ కాలనీ సెక్టార్-12 లాసెన్స్ బే కాలనీలో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. కాలనీలోని పలు రోడ్లు అపరిశుభ్రంగా మారి కంపుకొడుతున్నాయి. దీనికి కారణం కాలనీలో పలు చోట్ల రోడ్లపైనే పశువులను కడుతుండమే. పలు ఖాళీ స్థలాల్లో చాలా మంది పశువుల నిర్వహణ చేపడుతున్నారు. పెద్ద ఎత్తున నివాస స్థలాలు ఉండే ఈ ప్రాంతంలో వాటి మధ్యనే పశువులను కట్టడం, వాటి వ్యర్థాలు సైతం అక్కడే వేయడం చేస్తున్నారు. దీంతో ఆయా ఖాళీ స్థలాలకు ఆనుకొనివున్న అపార్ట్‌మెంట్‌ల వాసులు, నివాస స్థలాల వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పశువుల వ్యర్థాలతో కూడిన దుర్వాసన తాళలేకపోతున్నామని వాపోతున్నారు. దీంతో పాటు కొన్ని చోట్ల పశువులను నేరుగా రోడ్లపైనే కడుతున్నారు. దీంతో ఆయా రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. పశువుల వ్యర్థాలు, చెత్తా చెదారంతో కంపుకొడుతూ వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. అయితే ఈ సమస్యపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా జీవీఎంసీ శానిటరీ, వెటర్నరీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వెల్లడిస్తున్నారు. ఫలితంగా దోమలు ప్రబలి వ్యాధులు సైతం వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. నివాస సముదాయాలు, అపార్ట్‌మెంట్ కల్చర్ ఎక్కువగా ఉండే స్మార్ట్ కాలనీలోని సమస్యలనే పరిశుధ్య విభాగం అధికారులు పరిష్కరించకుంటే ఇతర ప్రాంతాల పరిస్థితేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ తీరుపై వీవోఏల నిరసన



ధర్నా చేస్తున్న ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగ సంఘం ప్రతినిధులు

సీతమ్మధార: తమ సమస్యల పరిష్కారంలో తీవ్ర అలసత్వం వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ వీవోఏలు మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద రెండో రోజు నిరాహార దీక్షలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిరాహార దీక్షలు నిర్వహించాలని ఏపీ వెలుగు వీవోఏ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం, సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు రూపాదేవి మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పిస్తామని, 3 సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 4వ తేదీన సెర్ప్ సీఈవో సమక్షంలో చర్చలకు ఆహ్వానించారని అన్నారు. అలాగే ప్రభుత్వం రెండు నెలల వేతనాలు వేస్తామని తెలిపిందన్నారు. బుధవారం జరగాల్సిన నిరాహారదీక్ష విరమిస్తున్నట్లు ప్రకటించారు. పని భారం పెంచారని,మహిళా మార్ట్‌లలో బలవంతపు కొనుగోళ్ల వల్ల ప్రజలు, గ్రూపు సభ్యుల నుండి తీవ్ర వ్యతిరేకత వస్తోందన్నారు. గ్రూప్ సభ్యులు అభయ హస్తం డబ్బులు వెంటనే చెల్లించాలని తీవ్ర ఒత్తిడి చేస్తున్న విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం అన్యాయం అన్నారు. ప్రజలు, వీవోఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ఆనందపురం నుండి పి. అపర్ణ, ఎం. శ్యామల, పద్మ, కుమారి, లావణ్య, పెందుర్తి నుండి వి. శ్రీలక్ష్మి, ఎ. శారద, జి. రమణి, బి. దేవి, పి. కృష్ణవేణి,, పద్మనాభం నుండి పి. కంచమ్మ, పి. సంతోషి, వరలక్ష్మి, కె. అప్పలకొండ, భీమిలి నుండి యు.పార్వతి, పి. వెంకటలక్ష్మి, కె. వెంకటలక్ష్మి, పార్వతి, హైమా నిరాహారదీక్షల్లో పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి యూనియన్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రెండు రోజుల పాటు సీపీఐ కార్యవర్గ సమావేశాలు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

అల్లిపురం: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యవర్గ సమావేశాలు ఈ నెల 30,31 తేదీల్లో విశాఖలో జరుగుతాయని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి తెలిపారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలన, వివిధ రంగాల పరిస్థితిపై చర్చించి భవిష్యత్ కార్యక్రమాల రూపకల్పన చేయనున్నట్లు వివరించారు. సీపీఐ శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో 29వ తేదీ సాయంత్రం 5 గంటలకు పౌరగ్రంథాలయంలో 'ఆధునిక భారత నిర్మాణంలో సీపీఐ పాత్ర - భవిష్యత్తు సవాళ్లు' అనే అంశంపై ప్రత్యేక సదస్సు జరుగుతుందన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని విజయసాయిరెడ్డి చేసిన అక్రమాల కారణంగా విశాఖ బ్రాండ్ ఇమేజ్ మసకబారిందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి విజయసాయిరెడ్డి అక్రమాలపై సుప్రీం కోర్టుకు లేఖ రూపంలో ఫిర్యాదు చేశారన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అయినా ఎందుకు విచారణకు ఆదేశాలు ఇవ్వలేకపోతున్నారని నిలదీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు విజయసాయిరెడ్డిపై చేసిన ఆరోపణలపై ఇప్పటికీ తగిన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, జీఎస్‌జే అచ్యుతరావు, ఎస్‌కే రెహమాన్, ఎం.మన్మథరావు, పి.చంద్రశేఖర్, సీఎస్ క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు

సీతమ్మధార : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ద్వారకా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రతాప్ సూచించారు. గురుద్వార జంక్షన్‌లో హెల్మెట్ లేకుండా రాకపోకలు సాగిస్తున్న వారికి మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్ ప్రయాణం చేయరాదని సూచించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. కారు డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ముందు సీటులో కూర్చునేవారు విధిగా సీటు బెల్టు పెట్టుకోవాలని తెలిపారు.

వాహనాలు నడిపే సమయంలో ఫోన్లలో మాట్లాడరాదని స్పష్టం చేశారు. రోడ్డు దాటే పాదచారులు ఫోన్లలో మాట్లాడడం చాలా ప్రమాదకరమని హెచ్చరించారు. రెడ్‌సిగ్నల్ జంపింగ్ చేసి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని కోరారు. మత్తు పదార్థాలు, గంజాయికి బానిసలైతే జీవితాలు నాశనమవుతాయని, చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.